సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ.18 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 38 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



తగ్గిన టమాట ధర
టమాట ధర మరింత తగ్గింది. కక్కలపల్లి మండీలో కిలో టమాట గరిష్ట ధర రూ.8.50, కనిష్టం రూ.3, సరాసరిన రూ.6 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.



జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

27 మండలాల్లో వర్షం



నీటితో కళకళలాడుతున్న ఫారంపాండ్

పుట్టపర్తి అర్బన్: మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ఎటు చూసినా జలకళ సంతరించుకుంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ 27 మండలాల్లో వర్షం కురవడంతో 23.5 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ముదిగుబ్బ మండలంలో 98.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక అమడగూరు మండలంలో 58.8 మి.మీ, కనగానపల్లిలో 53.4 మి.మీ, ఓడీచెరువులో 46.4, నల్లమాడలో 41.2, తలుపుల 40.8, నల్లచెరువు 40.4, తాడిమర్రి 38.8, తనకల్లు 36.8, కదిరి 35, చెన్నేకొత్తపల్లి 28.8, బుక్కపట్నం 28.4, పుట్టపర్తి 27.2, ధర్మవరం 26.4, కొత్తచెరువు 21.6, గాండ్లపెంట 20.2, ఎన్‌పీ కుంట 20, గోరంట్ల 18.2, బత్తలపల్లి 17.4, రామగిరి 15.6, లేపాక్షి 8.6, చిలమత్తూరు 7.8, రొళ్ల 7.2, పెనుకొండ 7.2, సోమందేపల్లి 4.2, పరిగి 3, హిందూపురం మండలంలో 1.2 మి మీ వర్షపాతం నమోదైంది.

తిరువణ్ణామలైకి ఆర్టీసీ ప్రత్యేక బస్సు



పుట్టపర్తి టౌన్: తమిళనాడు రాష్ట్రంలోని తిరువన్నామలైలో వెలసిన అరుణాచలస్వామిని దర్శించుకుని గిరిప్రదర్శన చేసే భక్తుల సౌకర్యార్థం ఈనెల 28న పుట్టపర్తి నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఇనయతుల్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీ కింద ప్రయాణికులకు అరుణాచలంతో పాటు వేలూరు గోల్డన్ టెంపుల్, కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనం కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈప్రత్యేక సర్వీసు 29న ఉదయం 10 గంటలకు పుట్టపర్తి ఆర్టీసీ డిపో నుంచి బయలుదేరుతుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా లేదా పుట్టపర్తి బస్టాండ్‌లో టికెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 7382860486, 9440201570 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

తొలిరోజు మిశ్రమ స్పందన



అనంతపురానికి చేరుకున్న వందేభారత్ రైలు

అనంతపురం సిటీ: హైదరాబాద్–బెంగళూరు మధ్య నూతనంగా ప్రవేశపెట్టిన వందేభారత్ రైలుకు తొలి రోజు మిశ్రమ స్పందన లభించింది. బెంగళూరులోని యశ్వంత్‌పూర్ రైల్వే స్టేషన్ నుంచి సోమవారం మధ్యాహ్నం 2.45 గంటలకు కాచిగూడకు బయలుదేరిన రైలు సాయంత్రం 5.40 గంటలకుకు అనంతపురానికి చేరుకుని 5.41 గంటలకు బయలుదేరింది. మొత్తం ఎనిమిది కోచ్‌ల్లో 522 మంది కూర్చొని వెళ్లే సామర్థ్యమున్న ఈ రైలులో 194 మంది టిక్కెట్లు బుక్ చేసుకున్నట్లు రైల్వే వర్గాలు వెల్లడించాయి. ఇందులో కామన్ కోచ్‌లో 133 మంది, ఎగ్జిక్యూటివ్ కోచ్‌లో 34 మంది ప్రయాణించారు. యశ్వంత్‌పూర్ నుంచి అనంతపురానికి 18 మంది ఉండగా, అనంతపురం నుంచి కాచిగూడకు 16 మంది టిక్కెట్లు బుక్ చేసుకున్నట్లు సమాచారం. రైలులో ప్రయాణించిన వారిలో 110 మంది భోజనాలు ఆర్డర్ ఇచ్చారు. అయితే ఆన్‌లైన్‌లో ఈ రైలుకు సంబంధించిన సమాచారం అప్‌డేట్ కాకపోవడంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.

29 నుంచి రోలర్ స్కేటింగ్ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం: త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే రోలర్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ఈ నెల 29 నుంచి చేపట్టనున్నారు. ఈ మేరకు అనంతపురం జిల్లా స్కేటింగ్ అదనపు కార్యదర్శి రవిబాబు, జిల్లా స్కేటింగ్ కోచ్ నాగేంద్ర సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 29న చిలమత్తూరు మండలం టేకులోడు స్టేక్ బోర్డులో ఎంపికలు ఉంటాయి. అలాగే 30వ తేదీ అనంతపురంలోని మాక్ రోలర్ స్కేటింగ్ అకాడమీలో రింక్ పోటీలు, అక్టోబర్ 1న జేఎన్‌టీయూ (అనంతపురం) క్యాంపస్ కళాశాలలో ఎంపికలు ఉంటాయి. అనంతపురం జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు పూర్తి వివరాలకు 94923 27908, 89783 14415లో సంప్రదించవచ్చు.

గాండ్లపెంటకు కృష్ణమ్మ!

కదిరి నియోజకవర్గమంతా పారుతున్న కృష్ణమ్మ గాండ్లపెంటకు గండిపెట్టింది. న్యాయం చేయాల్సిన అప్పటి పాలకుడు చంద్రబాబు తన నియోజకవర్గం కుప్పానికి నీరు తరలించేందుకు ప్లాన్ వేసి గాండ్లపెంట రైతులకు కడగండ్లు మిగిల్చారు. పాదయాత్రలో రైతుల కష్టాలను కళ్లారా చూసిన జగన్ కృష్ణాజలాలు కదిరి నియోజకవర్గమంతా పారిస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ఎత్తిపోతల పథకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తాజాగా నిధులూ మంజూరు చేయడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఎత్తిపోతల పథకానికి పచ్చజెండా
- నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- పాదయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వైనం
- సస్యశ్యామలం కానున్న కదిరి నియోజకవర్గం



హంద్రీ నీవా కాలువలో పారుతున్న కృష్ణాజలాలు

కదిరి: నియోజకవర్గంలో మొత్తం ఆరు మండలాలు ఉన్నాయి. గాండ్లపెంట మినహా మిగిలిన అన్ని మండలాల్లో హంద్రీ నీవా ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలు పారుతున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో పాదయాత్రలో భాగంగా కదిరి ప్రాంతంలో పర్యటించినప్పుడు ప్రస్తుత ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ద్వారా గాండ్లపెంట మండల రైతులు తమ మండలానికీ కృష్ణా జలాలు అందించాలని జగన్ దృష్టికి తీసుకెళ్లారు. 'ఎంతకష్టమైనా సరే.. మనం అధికారంలోకి రాగానే తప్పకుండా మీరు కోరినట్లు ఎత్తిపోతల పథకం(లిఫ్ట్ ఇరిగేషన్) ద్వారా గాండ్లపెంట మండలానికీ హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు ఇస్తాము'అని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే మలమీదపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కృష్ణా జలాలను గాండ్లపెంట మండలానికి ఇచ్చే విధంగా జీఓ జారీ చేశారు. తాజాగా రూ.46.14 కోట్ల నిధులు కూడా మంజూరు చేశారు. ఇదిలావుండగా, చంద్రబాబు అధికారంలో ఉండగా కదిరి ప్రాంతానికి నీరందించకుండా పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా తన నియోజకవర్గం కుప్పానికి తీసుకువెళ్లారు. దీంతో అప్పట్లో వైఎస్సార్‌సీపీ కదిరి ఇన్‌చార్జ్‌గా ఉన్న ఇప్పటి ఎమ్మెల్యే డా.సిద్దారెడ్డి రోజంతా జలదీక్ష చేసి రైతుల పక్షాన నిలిచారు.

త్వరలోనే టెండర్లు..
గాండ్లపెంట మండలానికి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కృష్ణా జలాలను ఇచ్చేందుకు త్వరలోనే రూ.46.14 కోట్ల అంచనా మొత్తంతో ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించనున్నారు. నల్లచెరువు మండలం సంజీవపల్లి వద్ద ప్రస్తుతం చెర్లోపల్లి రిజర్వాయర్ ద్వారా పుంగనూరు బ్రాంచ్ కెనాల్ వెళుతోంది. అక్కడి నుంచి గాండ్లపెంట మండలానికి కృష్ణా జలాలు తీసుకోవాలనేది ప్రభుత్వ ఆలోచన.

లిఫ్ట్ ఇరిగేషన్ వివరాలు ఇలా..	
నియోజకవర్గం	కదిరి
మండలం	గాండ్లపెంట
ప్రాజెక్టు	హంద్రీ నీవా
నిధులు	రూ. 46.14 కోట్లు
నింపే చెరువులు	22

22 చెరువులకు నీరు..
మొదట్లో కొంత దూరం దిగువ ప్రాంతం కావడంతో గ్రావిటీ ద్వారా నీరు ప్రవహిస్తుంది. తర్వాత అక్కడి నుండి ఎత్తిపోతల ద్వారా గాండ్లపెంట మండలానికి కృష్ణాజలాలను పంపింగ్ చేస్తారు. ముందుగా కదిరి మండల పరిధిలోని అబ్బవాండ్లపల్లి, బూరుగుపల్లి గ్రామాల పరిధిలోని 4 చెరువులకు కూడా ఈ నీరు అందుతుంది. తర్వాత గాండ్లపెంట మండలంలోని మరో 18 చెరువులను ఇలా మొత్తం 22 చెరువులను అధికారికంగా కృష్ణా జలాలతో నింపుతారు. అనధికారికంగా ఈ ప్రాజెక్టు ద్వారా ఇంకా ఎన్నో కుంటలను కూడా నింపాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈ భగీరథ ప్రయత్నం ఫలిస్తే కదిరి నియోజకవర్గం సస్యశ్యామలం కానుంది. హంద్రీనీవా మెయిన్ కెనాల్ ద్వారా ఇప్పటికే తలుపుల, ఎన్‌పీ కుంట మండలాలకు, పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా కదిరి, నల్లచెరువు, తనకల్లు మండలాల్లో కృష్ణా జలాలు పారుతున్న విషయం తెలిసిందే.



మలమీదపల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించిన మ్యాప్

సీజీ ప్రాజెక్టుకు మరో రూ. 2.75 కోట్లు విడుదల
స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీషర్లు తనకల్లు మండలంలో నిర్మించిన సీజీ ప్రాజెక్టు(చెన్నరాయస్వామి గుడి ప్రాజెక్టు)కూ పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా కృష్ణా జలాలు తరలించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం తాజాగా రూ. 2.75 కోట్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి సైతం సుమారు రూ. కోటి దాకా తన సొంత నిధులు వెచ్చించి కాలువను తవ్విస్తున్న విషయం తెలిసిందే. సీజీ ప్రాజెక్టు పరిధిలో 999 ఎకరాల ఆయకట్టు ఉంది. మొత్తం సాగులోకి రానుంది.

మాది చేతల ప్రభుత్వం



గాండ్లపెంట మండలానికి కృష్ణా జలాల అంశాన్ని సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లగానే 'తప్పకుండా ఇద్దాం' అన్నారు. ఇప్పుడు నిధులు కూడా మంజూరు చేశారు. మాది చేతల ప్రభుత్వం. హంద్రీనీవా జలాలతో ఇప్పటికే నియోజకవర్గంలోని ఎన్నో చెరువులను నింపాం. వీటి ద్వారా భూగర్భజలాలు పైపైకి వచ్చాయి. భవిష్యత్‌లో కదిరి నియోజకవర్గం తప్పకుండా సస్యశ్యామలమవుతుంది.
– డా.పీవీ సిద్దారెడ్డి, ఎమ్మెల్యే, కదిరి

మాటకు కట్టుబడ్డారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి కూడా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారు. ఇద్దరూ ఇద్దరే. గాండ్లపెంట మండలానికి కృష్ణా జలాలు వస్తున్నాయంటే చాలా సంతోషంగా ఉంది. జగన్ ప్రభుత్వానికి కదిరి ప్రాంత రైతులందరూ కృతజ్ఞతగా ఉంటారు.
– పోతినేని వెంకట చలపతి, రైతు, కోటూరు

ఆ ప్రయత్నాల్లోనే ఉన్నాం



డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీఆర్‌సీ) ప్రభుత్వానికి పంపగానే నిధులు మంజూరు చేశారు. త్వరలోనే మొత్తం ప్రణాళిక సిద్ధం చేసి టెండర్లు పిలుస్తాం. ఎత్తిపోతల పథకం ద్వారా కదిరి, గాండ్లపెంట మండలాల పరిధిలోని 22 చెరువులకు కృష్ణా జలాలు అందుతాయి. సీజీ ప్రాజెక్టు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.
– సి.అరుణ, ఇరిగేషన్ ఏఈ, కదిరి

బోర్డు లేదు.. సారు కానరారు

- 'సెబ్'లో అంతా ఇష్టారాజ్యం
- కార్యాలయానికి బోర్డు సైతం ఏర్పాటు చేయని అధికారులు
- రెండు నెలలుగా ఆఫీసులో కాలుపెట్టని సూపరింటెండెంట్
- షోకాజ్ నోటీసులు అందుకోకుండా తప్పించుకు తిరుగుతున్న వైనం

సాక్షి, పుట్టపర్తి

మద్యం, ఇసుక అక్రమ రవాణా అరికట్టడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) జిల్లాలో ఉందో, లేదో కూడా తెలియడం లేదు. శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి జంక్షన్‌లో ఉన్న ఈ కార్యాలయం నుంచే ఏడాదిగా కార్యకలాపాలు సాగుతున్నాయి. కానీ ఆ విషయం మాత్రం ఎవరికీ తెలియదు. ఏదైనా పని నిమిత్తం ఆ కార్యాలయానికి వెళ్లేందుకు అధికారులనే అడిగి అటువైపు వెళ్లినా కనీసం బోర్డు కూడా లేకపోవడంతో గుర్తించలేని పరిస్థితి. ఇక్కడ సూపరింటెండెంట్‌గా రవికుమార్ కూడా రెండు నెలలుగా కార్యాలయంవైపు కన్నెత్తి చూడటం లేదు. ఆయన వ్యవహారాలన్నీ ఆన్‌లైన్‌లో నడిపిస్తున్నట్లు కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి.

రెండు నెలలుగా దర్శనమివ్వని సారు..
జిల్లా సూపరింటెండెంట్ రవికుమార్ రెండు నెలలుగా జిల్లా కేంద్రంలో అడుగు పెట్టలేదు. అనంతపురం నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నారు. జిల్లాలోని సిబ్బందితో వీడియో, ఆడియో కాన్ఫరెన్సుల ద్వారా సమాచారం తీసుకుని అడపాదడపా హిందూపురం, పెనుకొండలో సమావేశాలు నిర్వహించారు తప్ప ఏ ప్రాంతం వైపూ కన్నెత్తి చూడలేదు. ఈ మీటింగ్‌ల వెనుకా పెద్ద కథే ఉన్నట్లు తెలుస్తోంది. గత ఆగస్టు 1వ తేదీ నుంచి పరిశీలిస్తే.. ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఆయన జిల్లా కేంద్రం, జిల్లా సెబ్ కార్యాలయం సందర్శించిన దాఖలాలు లేవు. కానీ జిల్లాలోని మిగతా ప్రాంతాలకు మాత్రం అప్పుడప్పుడు వచ్చి వెళ్తున్నారు. అలా ఎందుకు వచ్చి వెళ్తారో..ఎవరిని కలుస్తారో కూడా చాలా కాన్ఫిడెన్షియల్‌గా జరుగుతుంది. సూపరింటెండెంట్ విధులు పూర్తిగా విస్మరించడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



బోర్డు లేని సెబ్ కార్యాలయం

నోటీసులు తీసుకోవాల్సి వస్తుందనేనా...?
సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ తన ఛాంబర్‌ను పడకగదిగా మార్చుకుని ఏకంగా మంచం వేసి దానిపై పడుకున్న చిత్రాలు రెండు నెలల క్రితం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి. పత్రికల్లోనూ కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో ఆ మరుసటి రోజే కలెక్టర్ షోకాజ్ నోటీసులిచ్చారు. 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని అందులో ఉన్నా... సెబ్ సూపరింటెండెంట్ దాన్ని బేఖాతరు చేశారు. ఆ నోటీసులు తీసుకోవాల్సి వస్తుందనే ఆయన పుట్టపర్తి వైపు కన్నెత్తి చూడలేదని తెలుస్తోంది. దీనిపై కలెక్టర్ పి.అరుణ్‌బాబు కూడా సీరియస్ అయినట్లు తెలుస్తోంది.

విచారణ ఉత్తిదేనా?
ఇక సెబ్ అధికారి తన చాంబర్‌లో మంచంపై నుంచి విధులు నిర్వర్తించిన ఘటనపై విచారణ చేయాలని అదనపు ఎస్పీ ఎస్.విష్ణును ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి ఆదేశించారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి విచారణ చేసిన దాఖలాలు లేవు. దీనిపై అదనపు ఎస్పీని వివరణ కోరగా.. సెబ్ అధికారి అనారోగ్యం కారణంగా మంచంపై నుంచే విధులు నిర్వర్తిస్తే తప్పేంటని సమాధానం ఇచ్చారు.

ఒక్క అర్జీ పెండింగ్ ఉండకూడదు

- స్పందనలో అందే అర్జీలన్నీ సకాలంలో పరిష్కరించాలి
- ప్రాధాన్యతా భవన నిర్మాణాలను పూర్తి చేయండి
- కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: 'స్పందన'లో అందే అర్జీలకు గడువులోపు మెరుగైన పరిష్కారం చూపాలని, గడువు దాటిన తర్వాత ఒక్క అర్జీ పెండింగ్‌లో ఉండకూడదని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన'కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి 280 అర్జీలను అందాయి. కలెక్టర్ అరుణ్‌బాబు, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తదితరులు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... 'జగనన్నకు చెబుదాం' అర్జీల పరిష్కారంపై ప్రతి అధికారి వ్యక్తి గతంగా దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ప్రతి అర్జీని సీఎం కార్యాలయం మానిటర్ చేస్తుందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. అర్జీ గడువు దాటకుండా పరిష్కారం చూపి ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. మండల స్థాయిలో వచ్చిన 'స్పందన' అర్జీలు అధికంగా పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే పరిష్కారం చూపాలన్నారు.

అక్టోబర్ 30 నాటికి భవన నిర్మాణాలు పూర్తి కావాలి..
గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు తదితర ప్రభుత్వం ప్రాధాన్యతా భవన నిర్మాణాలన్నీ అక్టోబర్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఇంజినీర్లు, ఎంపీడీఓలను కలెక్టర్ ఆదేశించారు. స్పందన అనంతరం ఆయన అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రతి అధికారి లక్ష్యాలను నిర్దేశించుకొని పనులు పూర్తి చేయాలన్నారు. పూర్తయిన వాటిని సంబంధిత శాఖలకు అప్పగించాలన్నారు. భవనాలకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. 5 రోజుల్లో బిల్లులన్నీ అప్‌డేట్ చేసి క్లియర్ చేయాలన్నారు. జిల్లాలోని 833 భవనాల్లో 367 భవనాలు పూర్తి చేసి అప్పగించారని, తక్కిన 466 భవనాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అదేవిధంగా హౌసింగ్, గడప గడపకూ మన ప్రభుత్వంలో మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

'జగనన్న ఆరోగ్య సురక్షను' విజయవంతం చేయండి
పైలెట్ ప్రాజెక్టు కింద పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలో మంగళవారం నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలన్నారు.

27న బుక్కపట్నంలో జగనన్నకు చెబుదాం..
ఈనెల 27వ తేదీ బుధవారం బుక్కపట్నంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమం గురించి మండల వాసులకు తెలియజేయాలన్నారు. అలాగే 'స్వచ్ఛతా హీ సేవ–2023' కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, డీపీఓ విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీల్లో కొన్ని...
- అగ్ని ప్రమాదంలో తన ఇల్లు కాలిపోగా, అధికారులు జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరు చేశారని, అయితే సదరు స్థలాన్ని కొంత మంది ఆక్రమించుకున్నారని అమడగూరుకు చెందిన అక్కమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్థలాన్ని తనకు స్వాధీనం చేసి న్యాయం చేయాలని కోరారు.
- కొత్తచెరువు మండలం కేశాపురం గ్రామంలో నాలుగు రోజుల నుంచి విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని శ్రీనాథ్‌రెడ్డి, నాగేంద్ర, బాలప్ప, రజితమ్మ తదితరులు కలెక్టర్‌కు విన్నవించారు. వెంటనే గ్రామానికి విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలన్నారు.
- 1980లో చిలమత్తూరు మండలం శెట్టిపల్లి గ్రామ పొలం సర్వే నంబర్ 215–7లోని 44 సెంట్లు భూమిని కొనుగోలు చేశానని, పట్టాదార్ పాస్ పుస్తకంలో ఎక్కించాలని రెవెన్యూ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని నాగిరెడ్డి ఫిర్యాదు చేశారు. వివరాలన్నీ పరిశీలించి పట్టాదార్ పాస్ పుస్తకం మంజూరు చేయించాలని కోరారు.

నేడు, రేపు 'ఇంటర్ కాలేజ్ ఫెస్ట్–2023'



సెంట్రల్ యూనివర్సిటీ నుంచి వస్తున్న విద్యార్థులు

అనంతపురం: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ అండ్ ఒకేషనల్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలోని యువ టూరిజం క్లబ్ ఈ నెల 26, 27 తేదీల్లో 'ఇంటర్ కాలేజ్ ఫెస్ట్–2023' నిర్వహించనుంది. యంగ్ మేనేజర్, ట్రెజర్ హంట్, స్పాట్ ఫొటోగ్రఫీ, క్విజ్ వంటి పోటీలలో అనంతపురం సమీపంలోని కళాశాలల విద్యార్థులు ప్రత్యక్షంగా పాల్గొనవచ్చు. దేశవ్యాప్తంగా ఈ–పోస్టర్ మేకింగ్ పోటీని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో విజేతలకు 27న ఆకర్షణీయమైన ప్రైజ్ మనీ అందజేస్తారు. ఈ సందర్భంగా విద్యార్థులు భారతదేశ రుచులను పరిచయం చేసేందుకు వివిధ ఫుడ్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఏపీ టూరిజం అథారిటీ సహకారంతో మేనేజ్‌మెంట్ విభాగం సోమవారం వరల్డ్ టూరిజం డే థీమ్ 'టూరిజం అండ్ గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్స్'పై వ్యాసరచన, ప్రసంగాన్ని కూడా నిర్వహించింది. విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని మేనేజ్‌మెంట్ విభాగం అధ్యాపకులు కోరారు.

నిరుద్యోగులకు టోకరా

- బీటెక్ విద్యార్థులే టార్గెట్
- రూ.5 కోట్లు దోపిడీ
- ఆంధ్రా, తెలంగాణలో 150 మందికి పైగా బాధితులు
- మోసగాళ్ల వెనుక టీడీపీ నేతలు

అనంతపురం క్రైం: ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ పేరిట నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన ఉదంతం అనంతపురంలో వెలుగు చూసింది. బాధితులు సోమవారం అనంతపురం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను 'స్పందన'లో కలసి జరిగిన మోసంపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాప్తాడుకు చెందిన టీడీపీ నేత కనుసన్నల్లో అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన శశి, ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన గుర్రం వెంకటరామ్, భానుచంద్రతో పాటు మరికొంత మంది ఘరానా కేటుగాళ్లు.. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాల పేరిట బీటెక్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు వల వేశారు. ప్రధానంగా కంప్యూటర్ శిక్షణ కేంద్రాల వద్ద పాగా వేసిన వీరు అనతి కాలంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 150 మందికి పైగా నిరుద్యోగులను ముగ్గులోకి దింపారు. శాలరీ ప్యాకేజీని బట్టి ధర ఉంటుందంటూ ఒక్కొక్కరి వద్ద రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల దాకా వసూలు చేశారు. ఇలా రూ. 5 కోట్లకు పైగా దండుకున్నారు. డబ్బిచ్చిన వారికి ఆరు నెలల శిక్షణ కూడా ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో రూ.10 వేల నుంచి రూ.18 వేల దాకా గౌరవ వేతనం కూడా చెల్లిస్తామని నమ్మబలికారు.

నకిలీ కంపెనీ పెట్టి...
బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీలో 'సార్టీస్ టెక్నాలజీ లిమిటెడ్' పేరుతో నకిలీ కంపెనీ ఏర్పాటు చేశారు. నిజమని నమ్మి డబ్బు కట్టిన వారు అదే ప్రాంతంలో అద్దెకు గదులు తీసుకుని ఆరు నెలల పాటు వారు చెప్పిన పని చేసుకుంటూ వచ్చారు. అయితే.. వారికి కంపెనీ పనులు పూర్తి కాలేదంటూ గౌరవ వేతనం కూడా చెల్లించలేదు. చేసేది లేక చాలా మంది నిరుద్యోగులు 'ఎలాగూ ఇన్ని నెలలు ఉన్నాం కదా?! మిగిలిన కాలం పూర్తి చేస్తే ఉద్యోగం దొరుకుతుంద'న్న ఆశతో అప్పులు చేసి మరీ కాలం గడిపారు. తీరా నిర్వాహకులు రాత్రికి రాత్రే కంపెనీకి తాళాలు వేసి అనంతపురానికి చేరుకున్నారు. బాధితులు బెంగళూరు నుంచి ఇళ్లకు రాలేక, అయిన వారికి ముఖం చూపించలేక నరకయాతన అనుభవించారు.

డబ్బుడిగితే బెదిరిస్తున్నారు!
నిరుద్యోగులను వంచించిన వారు అనంతపురంలో జల్సాలు చేసుకుంటూ తిరుగుతున్నారు. వారిని బాధితులు కలసి తమ డబ్బు తిరిగివ్వాలని కోరితే... బెదిరింపులకు దిగుతున్నారు. 'మా వెనుక రాప్తాడుకు చెందిన టీడీపీ నేతలు ఉన్నారు. ఖబడ్దార్' అంటూ దాడులకు సైతం తెగబడుతున్నారు. రెండు రోజుల క్రితం జిల్లా పరిషత్‌లోని చిత్రావతి అతిథి గృహం వద్దకు బాధితులను పిలిపించుకుని టీడీపీ నేతలు బెదిరింపులకు దిగారు. 'అన్నీ మూసుకుని వెళతారా? లేక తన్నులు తింటారా' అంటూ బెదిరించారు. దీంతో బాధితులు సోమవారం జిల్లా ఎస్పీని కలసి ఫిర్యాదు చేశారు.



నాన్న ఆరోగ్యం బాగోలేదన్నా కనికరించలేదు
పుట్టపర్తికి చెందిన ఓ యువకుడు తండ్రికి తెలియకుండా లక్షలాది రూపాయలు అప్పుగా తెచ్చి వారికి చెల్లించాడు. ప్రస్తుతం తండ్రి ఆరోగ్యం బాగా క్షీణించి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉంది. దీంతో అతను అనంతపురం వచ్చి వారిని కాళ్లా వేళ్లా పడినా డబ్బివ్వలేదు. పైగా మరోసారి వస్తే నీపైనే కేసు పెడతామని బెదిరించారు.

క్లుప్తంగా

పెన్నహోబిలంలో హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం హుండీ కానుకలను లెక్కించారు. ఆలయ ఈఓ విజయ్‌కుమార్, దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.రాణి పర్యవేక్షించారు. ఆలయంలోని ఆరు హుండీలను లెక్కించగా 119 రోజులకు గాను రూ.30,14,991 ఆదాయం చేకూరింది.

పండమేరులో పడి యువతి మృతి



సాకే చంద్రకళ

రాప్తాడు: ప్రమాదవశాత్తు పండమేరులో పడి ఓ యువతి మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడుకు చెందిన చిన్న ఓబన్న కుమార్తె సాకే చంద్రకళ (33) తల్లిదండ్రులు మృతిచెందడంతో సోదరులు గౌరిశంకర్, శ్రీనివాసులు వద్ద ఉంటోంది. కంటి చూపు సరిగా లేని ఆమె సోమవారం ఉదయం జేఎన్‌టీయూ మార్గంలోని పండమేరు వంకలోకి బహిర్భూమి కోసం వెళ్లింది. ఆ సమయంలో అదుపు తప్పి వంకలో పడడంతో నీట మునిగి ఊపిరి ఆడక మృతి చెందింది. 11 గంటల ప్రాంతంలో అటుగా వెళ్లిన వారు గుర్తించి, సమాచారం అందించడంతో ఎస్‌ఐ ఆంజనేయులు అక్కడకెళ్లి మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతురాలిని చంద్రకళగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో వారొచ్చి ధ్రువీకరించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మహబూబ్‌బాషాకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు



డి.మహబూబ్‌బాషా



అవార్డుకు ఎంపికైన ఫొటో

అనంతపురం కల్చరల్: సాక్షి దినపత్రిక ఫొటోగ్రాఫర్ డి.మహబూబ్‌బాషాకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు దక్కింది. ఈ మేరకు ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా (పీఏఐ) ఫౌండర్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల రాష్ట్ర పర్యాటక శాఖ సౌజన్యంతో పీఏఐ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు సూర్యోదయం సమయంలో భానుడి లేలేత కిరణాలు తాకి శోభాయమానంగా వెలుగులీనుతున్న ఇస్కాన్ మందిరాన్ని తన కెమెరాలో మహబూబ్‌బాషా బంధించిన తీరు ప్రకృతి రమణీయతకు అద్దం పట్టింది. ఈ చిత్రమే ఆయనను పోటీల్లో విజేతగా నిలబెట్టింది. ఈ నెల 27న విజయవాడ వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి పర్యాటక దినోత్సవంలో మంత్రులు, అధికారుల చేతుల మీదుగా ఆయన అవార్డుతో పాటు బంగారు పతకాన్ని అందుకోనున్నారు. ఉత్తమ ఫొటో జర్నలిస్టుగా ఎంపికైన మహబూబ్ బాషాను జిల్లా ఫొటో జర్నలిస్టు యూనియన్ నాయకులు అభినందించారు.

'పోలీసు స్పందన'కు 42 వినతులు



బాధితురాలితో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 42 వినతులు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా వినతులు స్వీకరించి బాధితులతో మాట్లాడారు. అందిన వినతుల్లో ఎక్కువగా భూతగాదాలే ఉండడం గమనార్హం. ఇందులో పోలీసులు జోక్యం చేసుకుని అర్హులకు అన్యాయం చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే పెనుకొండ సీఐ కరుణాకర్‌కు వ్యతిరేకంగా ఏకంగా మూడు ఫిర్యాదులు అందాయి. భూతగాదాల్లో ఆయన జోక్యం చేసుకుని తమను బెదిరిస్తున్నారంటూ ఎస్పీ ఎదుట బాధితులు వాపోయారు. రొద్దం మండలం పెద్దకోడిపల్లిలో ఎన్నో ఏళ్లుగా గ్రామకంఠం పరిధిలో ఉన్న రహదారిని అదే గ్రామానికి చెందిన కొందరు నకిలీ పట్టా సృష్టించి కబ్జా చేశారని, దీంతో తమ ఇళ్లకు రాకపోకలు సాగించేందుకు మార్గం లేకుండా ఇబ్బంది పడుతున్నామని ఆ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంగా సీఐ కరుణాకర్ తమను స్టేషన్‌కు రప్పించుకుని చితకబాది, బెదిరించినట్లు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ నేపథ్యంలో సీఐ కరుణాకర్‌కు అనుకూలంగా అదే గ్రామానికి చెందిన మరో వర్గం వినతి పత్రం అందజేసింది. అలాగే కులాంతర వివాహం చేసుకున్న తమకు పెద్దల నుంచి ప్రాణహాని ఉందంటూ తలుపుల మండలం వేపమానుపేటకు చెందిన జ్యోత్స్న, హరీష్ ఎస్పీని ఆశ్రయించి, ఫిర్యాదు చేశారు. ఈ నెల 9న తాము ప్రేమ వివాహం చేసుకున్నట్లు వివరించారు. అయితే కులాలు వేరు కావడంతో అమ్మాయి తరఫు వారు పెళ్లికి అంగీకరించడం లేదని, దీంతో ధర్మవరంలో తలదాచుకుంటున్నట్లు వివరించారు. తమకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విష్ణు, దిశ డీఎస్పీ వరప్రసాద్, న్యాయ సలహాదారు సాయినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పాడి పోషణ లాభదాయకం

- పశు సంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం



పాడిరైతుల క్షేత్ర సందర్శన బస్సు యాత్రను ప్రారంభిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: ఆధునిక మెలకువలు పాటిస్తే పాడి పోషణ లాభదాయకంగా ఉంటుందని రైతులకు పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం సూచించారు. పాడి పోషణపై రెడ్డిపల్లి ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ పశుగణన మిషన్ ద్వారా అభ్యుదయ పాడి రైతులకు క్షేత్ర సందర్శన కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ప్రకాష్ డెయిరీ సందర్శన నిమిత్తం ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 40 మంది రైతులను పిలుచుకెళ్లారు. సోమవారం పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయ ఆవరణలో రైతులు వెళ్లే బస్సును జేడీ సుబ్రహ్మణ్యం జెండా ఊపి ప్రారంభించి, మాట్లాడారు. వ్యవసాయం తర్వాత అత్యధికంగా రైతులు పాడి పోషణపై ఆధారపడ్డారన్నారు. అయితే సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోవడంతో కొంత నష్టాలను చవి చూడాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో పాడి పోషణపై రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్ర సందర్శనకు రైతులను తీసుకెళుతున్నట్లు వివరించారు. పాడిపరిశ్రమలో రాణించాలనే రైతులకు ఇది సువర్ణ అవకాశమన్నారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి ప్రాంతీయ పశు సంవర్ధక శిక్షణాకేంద్రం ఏడీ రామచంద్రారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్లు రమేష్‌రెడ్డి, వెంకటేష్, అసిస్టెంట్ డైరెక్టర్లు రత్నకుమార్, శ్రీకాంత్, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిల్పారామంలో పర్యాటక వేడుకలు

అనంతపురం కల్చరల్: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నుంచి రెండ్రోజుల పాటు అనంతపురం నగర శివారులోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు వేడుకలను ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, కలెక్టర్ గౌతమి ప్రారంభించనున్నారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులను అందజేయనున్నారు. బుధవారం ఉదయం 8.30 గంటలకు అనంతపురం ఆర్ట్స్ కళాశాల వద్ద పర్యాటక ప్రాధాన్యతను తెలియజేసేలా బైక్ ర్యాలీ ఉంటుంది. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించే ఈ ర్యాలీ రామనగర్, 80 ఫీట్ రోడ్, సంగమేష్ నగర్ మీదుగా కలెక్టరేట్ చేరుకుంటుంది. మధ్యాహ్నం పుట్టపర్తి జిల్లాలో పర్యాటక ర్యాలీలు, సాంస్కృతిక సంబరాలు జరుగుతాయి. ఈ మేరకు జిల్లా పర్యాటక శాఖ అధికారి జి.నాగేశ్వరరెడ్డి తెలిపారు.

బావిలో పడి యువకుడి మృతి

గోరంట్ల: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గోరంట్ల మండలం మోట్రావపల్లికి చెందిన నారాయణప్ప కుమారుడు అశోక్‌కుమార్ (20) మతి స్థిమితం లేక బాధపడుతున్నాడు. సోమవారం గ్రామ శివారులోని పాడుబడిన బావి వద్దకు బహిర్భూమికి వెళ్లిన అశోక్‌కుమార్.. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

పెద్దవడుగూరు: విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరుకు చెందిన కృష్ణారెడ్డి (64)కి భార్య పద్మావతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం గ్రామ శివారులోని తన పొలంలో సాగు చేసిన కొర్ర పంటను పరిశీలిస్తూ వెళుతుండగా అప్పటికే తెగిపడిన 11కేవీ విద్యుత్ లైన్‌ను గమనించకుండా కాలు పెట్టడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంతసేపటికీ కృష్ణారెడ్డి ఇంటికి చేరుకోకపోవడంతో సాయంత్రం భార్య పద్మావతి పొలానికి వెళ్లి చూసింది. అప్పటికే విగతజీవిగా కొర్ర పంటలో పడి ఉన్న భర్తను గమనించి బోరున విలపిస్తూ చుట్టుపక్కల రైతులను అప్రమత్తం చేసింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడు చేరుకుని పరిశీలించి, బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వ్యక్తి దుర్మరణం

చిలమత్తూరు: లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... చిలమత్తూరు మండలం మరువ కొత్తపల్లి గ్రామానికి చెందిన నరసింహమూర్తి(45) సోమవారం ఉదయం బాగేపల్లి వైపు నుంచి ద్విచక్రవాహనంలో వస్తుండగా లాలేపల్లి క్రాస్ సమీపంలో వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన పాల లారీ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

నేటి నుంచి జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా మంగళవారం నుంచి జాతీయ స్థాయి ఫుట్‌బాల్ సబ్ జూనియర్ బాలుర చాంపియన్ షిప్ - 2023 పోటీలు ప్రారంభం కానున్నాయి. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన మొత్తం 20 జట్లు తలపడనున్న ఈ పోటీలు అక్టోబర్ 10న ముగుస్తాయి.

రేపు బుక్కపట్నంలో 'జగనన్నకు చెబుదాం'

పుట్టపర్తి: మండలం కేంద్రంలో బుధవారం ఉదయం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు తహసీల్దార్ కరుణాకర్, ఎంపీడీఓ శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బుక్కపట్నం పీహెచ్‌సీ ఎదుట ఉన్న షాదీఖానాలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి కలెక్టర్ అరుణ్‌బాబుతో పాటు జిల్లా స్థాయి అధికారులు హాజరుకానున్నారు.

29న జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ టెన్నిస్ పోటీలు

అనంతపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న జిల్లా స్థాయి టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సుగుణమ్మ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అండర్-17, అండర్-14 విభాగంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల బాలబాలికలకు అనంతపురం నగరంలోని నారాయణ టెన్నిస్ అకాడమీలో పోటీలు ఉంటాయి. సంబంధిత పాఠశాలల పీఈటీ, పీడీలు ఆసక్తి ఉన్న క్రీడాకారులతో ఆన్‌లైన్ ద్వారా ముందుగా ఎంట్రీ చేసుకోవాలి. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు మధ్యాహ్న భోజనం అందజేస్తారు.

పురిటి బిడ్డను కోల్పోయాం

- ఆస్పత్రి వద్ద బాధితుల ఆందోళన



నర్సింగ్ హోం ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు

హిందూపురం: ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకుల నిర్వాకం వల్ల పురిటి బిడ్డను కోల్పోయామంటూ దంపతులు ఎస్‌కే సల్మాన్, కౌసర్ వాపోయారు. సోమవారం మధ్యాహ్నం హిందూపురంలోని తేజా నర్సింగ్ హోం ఎదుట బాధిత కుటుంబసభ్యులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆస్పత్రి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివరాలు... పురిటి నొప్పులతో బాధపడుతున్న కౌసర్‌ను ఈ నెల 21న కుటుంబసభ్యులు తేజా నర్సింగ్ హోంలో చేర్పించారు. ఉమ్మ నీరు తక్కువగా ఉందని, అయినా సాధారణ కాన్పు చేస్తామంటూ రూ.34వేలు ఫీజు డిమాండ్ చేశారు. అయితే సాధారణ కాన్పు కాకుండా సిజేరియన్ చేశారు. అప్పటికే బిడ్డ మరణించింది. ఈ విషయాన్ని ఆస్పత్రి నిర్వాహకులు దాచిపెట్టి బేబీ పల్స్ డౌన్ అయ్యాయని మరో ఆస్పత్రికి తీసుకెళ్లాలంటూ సూచించారు. ఈ క్రమంలో మరో ఆస్పత్రికి చేరుకుంటే అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే శిశువు మృతి చెందినట్లు నిర్ధారించారు. కేవలం డబ్బు కోసం కాలయాపన చేసి తమకు కడుపుకోత మిగిల్చిన తేజా నర్సింగ్ హోం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలంటూ సల్మాన్ కుటుంబసభ్యులు ఆ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. కాగా, ఘటనకు సంబంధించి తేజా నర్సింగ్ హోం డాక్టర్ అశ్వినిని వివరణ కోరగా... 'కడుపునొప్పితో బాధపడుతున్న గర్భిణిని రెండు వారాల క్రితం ఆస్పత్రికి పిలుచుకువచ్చారు. ఇన్‌ఫెక్షన్ ఎక్కువగా ఉండడంతో రెండ్రోజులు అడ్మిట్ చేసుకుని చికిత్స చేశాం. నొప్పి తగ్గడంతో ఇంటికి వెళ్లిపోయారు. అప్పటికే 14 శాతం ఉన్న ఉమ్మనీరు.. రెండు వారాల తర్వాత 8 శాతానికి చేరుకుంది. అయినా వారు అలాగే ఉండి కడుపునొప్పి తీవ్రమైనప్పుడు మళ్లీ వచ్చారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో పాటు నవజాత శిశువును ఐసీయూలో ఉంచాల్సి వస్తుందని చెప్పి, అనంతపురానికి తీసుకెళ్లాలని సూచించాం. అయితే వాళ్లు ఒప్పుకోలేదు. ఇక్కడే కాన్పు చేయాలని కోరడంతో ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నాం. మూడ్రోజుల పాటు ఇన్‌ఫెక్షన్‌ను కంట్రోల్ చేయడానికి చికిత్స చేశాం. డబ్బు కట్టలేదని కాన్పు చేయకుండా ఆలస్యం చేశారనడం అవాస్తం. మెరుగైన చికిత్సనే అందజేశాం' అని అన్నారు.

హ్యాండ్ బాల్, హాకీ జట్ల ఎంపిక

అనంతపురం: ఈ నెల 29 నుంచి గుంటూరులోని తెనాలిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ సోమవారం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సుగుణమ్మ తెలిపారు. అండర్-14, అండర్-17 హ్యాండ్ బాల్ ఎంపికకు పోటీలకు ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన బాలబాలికలు హాజరు కాగా, వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అలాగే అండర్-14, అండర్-17 హాకీ క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ కూడా పూర్తి చేశారు. హాకీ పోటీల షెడ్యూల్ త్వరలో ప్రకటించనున్నారు.

రెజ్లింగ్‌లో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు..

విజయవాడ వేదికగా ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకూ జరిగిన 67వ స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ విభాగంలో జిల్లా క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు దక్కించుకున్నారు. అండర్-14, అండర్-17 విభాగంలో మొత్తం 17 పతకాలను బాలబాలికలు సాధించారు. ఇందులో మూడు బంగారు, ఏడు వెండి, మరో ఏడు రజత పతకాలు ఉన్నాయి.

ఆర్మీ సెలక్షన్స్‌లో ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విజయఢంకా



ఆర్మీ సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులతో అకాడమీ చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి

తిరుపతి రూరల్: గుంటూరులో ఈ నెల 24న నిర్వహించిన ఆర్మీ సెలక్షన్స్‌లో తిరుపతిలోని ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు వివిధ విభాగాల్లో విజయదుందుభి మోగించారు. ఈ మేరకు ఆ అకాడమీ చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సోమవారం తిరుపతిలోని అకాడమీలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శేషారెడ్డి మాట్లాడుతూ ఆర్మీ సెలక్షన్స్‌లో అకాడమీకి చెందిన 85 మంది విద్యార్థులు వివిధ విభాగాలకు ఎంపికవడంపై హర్షం వ్యక్తం చేశారు. టెక్నికల్ విభాగంలో 17 మంది, జీడీ-66, ట్రేడ్స్‌మెన్-2 ఇలా మొత్తం 85 మంది సెలక్ట్ అయ్యారన్నారు. అకాడమీలో విద్యతో పాటు డిఫెన్స్‌లో ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన శారీరక, మానసిక, సాంకేతిక, వ్యక్తిత్వ వికాసం అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులకు అకాడమీలో ఉచిత విద్యను అందిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెద్దాస్పత్రిలో గద్దలు



- అలా రాగానే.. ఇలా పంపించేస్తారు
- సర్వజనాస్పత్రి పేషెంట్లను బెంబేలెత్తిస్తున్న మాఫియా
- 'ఆరోగ్యశ్రీ' కింద మెరుగైన వైద్యమంటూ 'ప్రైవేట్'కు తరలింపు
- కేసు రాగానే ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి సిఫార్సుదారులకు 'ఫోన్ పే'
- మాఫియాలో ఆస్పత్రి సిబ్బంది, డాక్టర్లు, కొందరు మీడియా ప్రతినిధులు

ఈ ఏడాది సెప్టెంబర్ 4 వరకూ నమోదైన కేసులు	
మొత్తం ఆరోగ్యశ్రీ కేసులు	31,802
ప్రైవేటుకు వెళ్లిన కేసులు	21,505
సర్వజనాసుపత్రికి వచ్చినవి	8,760

❒ నెల క్రితం రోడ్డు ప్రమాదంలో అనంతపురానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఒకరు తీవ్రంగా గాయపడి సర్వజనాస్పత్రికి వచ్చారు. ఇక్కడ సరిగా వైద్యం అందదని, ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లండని ఎమర్జెన్సీ వార్డు దగ్గరే కొందరు చెప్పి వెనక్కు పంపించారు. బాధితుడు ప్రైవేటు ఆస్పత్రిలో నాలుగు రోజులుండి అక్కడ కోలుకోలేక తిరిగి సర్వజనాస్పత్రికి వచ్చి చేరాడు. ఇక్కడే వైద్యం పొంది డిశ్చార్జి అయ్యారు.

❒ వారం క్రితం ఉరవకొండకు చెందిన ఓ యువకుడు ద్విచక్రవాహనంపై వెళుతూ కిందపడి తీవ్రగాయాలతో అనంతపురం సర్వజనాస్పత్రికి వచ్చారు. మల్టిపుల్ ఫ్రాక్చర్ అయ్యింది. ఈ సర్జరీలు అక్కడ బాగా చేస్తారని ఓ ప్రైవేటు ఆస్పత్రికి పంపించారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించినప్పటికీ అతని నుంచి అదనంగా డబ్బు వసూలు చేశారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి జిల్లాలోని పేదలందరికీ అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రే పెద్ద దిక్కు. ఇక్కడ అన్నిరకాల స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయి. వివిధ జబ్బులు, దీర్ఘకాలిక రోగాలు, అత్యవసర సేవలకు ఉచితంగా ఖరీదైన, నాణ్యమైన వైద్యం అందిస్తారు. అయితే గత కొన్ని నెలలుగా సర్వజనాస్పత్రికి వస్తున్న రోగులను ప్రైవేట్ ఆస్పత్రులు గద్దల్లా తన్నుకుపోతున్నాయి. ఇందుకు సర్వజనాస్పత్రికి చెందిన కొందరు ఎంఎన్‌ఓలు, డాక్టర్లు, మీడియా ప్రతినిధుల సహకారం తీసుకుంటున్నాయి. వీరంతా పేషెంటు రాగానే 'ఇక్కడ వైద్య సేవలు బాగలేవు' అని భయపెట్టి ప్రైవేట్ ఆస్పత్రులకు పంపడం నిత్యకృత్యమైంది. ఇలా పంపిన కేసులు ఆరోగ్యశ్రీ కింద అడ్మిషన్ అవగానే సదరు సిఫార్సుదారులకు ప్రైవేటు ఆస్పత్రుల నుంచి ఫోన్ పే ద్వారా 'నజరానాలు' అందుతున్నట్లు 'సాక్షి' పరిశీలనలో వెల్లడైంది.

ఆరంభంలోనే భయపెట్టేస్తారు

సాధారణంగా ప్రమాద కేసులన్నీ 108 వాహనంలో ఆస్పత్రికి వస్తాయి. పేషెంటును కిందకు దింపగానే ఎంఎన్‌ఓలు, కొంతమంది మీడియా ప్రతినిధులు, ఒకరిద్దరు డాక్టర్లు వెంటనే పేషెంటు బంధువులను భయపెడతారు. ఇక్కడ బెడ్‌లు లేవనో, డాక్టర్లు లేరనో చెబుతారు. ఆ మరుక్షణమే బయటే కాచుకుని ఉన్న ప్రైవేటు అంబులెన్సు డ్రైవర్లు లోపలకు వస్తారు. పేషెంటును వెంటనే ఎక్కించుకుని 'సిబ్బంది' చెప్పిన ప్రైవేటు ఆస్పత్రికి చేరుస్తారు. అక్కడ ఆరోగ్యశ్రీ కింద చేర్చినా అప్రూవల్ వచ్చే వరకూ టెస్టులు, ఎక్స్‌రేలు, స్కానింగులు అంటూ రూ.10 వేలు తక్కువ కాకుండా వసూలు చేస్తారు.

కాసుల కోసం కక్కుర్తి

శవాలమీద పేలాలు ఏరుకోవడం అంటే ఇదే. ప్రమాదాలు లేదా అత్యవసర చికిత్సలో భాగంగా వచ్చే పేద రోగులను ఇక్కడ కొంతమంది దోచుకుతింటున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న కొంతమంది మీడియా ప్రతినిధులపై గతంలో ఒక వైద్యుడు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

అధికారులకు తెలిసినా...

ఆస్పత్రి ఉన్నతాధికారులకు ఈ తతంగం తెలిసినా పట్టించుకునే పరిస్థితి లేదు. స్వయానా సూపరింటెండెంట్‌కు ఈ వ్యవహారం తెలిసినా ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. ఒకదశలో ఆర్‌ఎంఓలు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. దీంతో సామాన్యులు సూపరింటెండెంట్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భారీగా తగ్గిన ఆరోగ్యశ్రీ కేసులు

ఆరోగ్యశ్రీ కేసులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో భారీగా పెరగాలని ప్రభుత్వం ఆదేశించినా ఇక్కడ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఆరోగ్యశ్రీ కేసులు సర్వజనాస్పత్రికి పూర్తిగా తగ్గిపోతున్నాయి. జిల్లాలో ఆరోగ్యశ్రీ కేసులు 67.62 శాతం ప్రైవేటుకు వెళుతున్నాయి. సర్వజనాస్పత్రికి 27 శాతం కేసులు మాత్రమే వస్తున్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం

సర్వజనాపత్రికి వచ్చిన కేసులను ప్రైవేటు ఆస్పత్రులకు పంపిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు పెడతాం. దీనిపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ ఉంటుంది. దీనివెనుక ఎవరున్నా చర్యలు తప్పవు.

– గౌతమి, కలెక్టర్

అసౌకర్యం కల్పిస్తే వదిలేదే లేదు

ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు అసౌకర్యం కల్పించి ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేస్తే వదిలేది లేదు. ఇలాంటి వాటిపై నాకు నేరుగా ఫిర్యాదు చేయొచ్చు. నా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు ఇస్తే మిగతావన్నీ నేను చూస్తా. రోగుల తరలింపు వెనుక ఎంత పెద్ద వారున్నా వదిలే ప్రసక్తే లేదు. 94407 96800కు ఫోన్ చేస్తే చాలు.

– అన్బురాజన్, ఎస్పీ